


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

బుధవారం 27 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 359 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## రాష్ట్రంలో ఎబోలా కేసులు లేవు

### ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు: మంత్రి దామోదర్ రాజనర్సింహ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 27, ప్రతినిధి: రాష్ట్రంలో ఇప్పటివరకు ఎబోలా కేసులు నమోదు కాలేదని, ఎబోలా లక్షణాలు ఉన్న వ్యక్తులను కూడా గుర్తించలేదని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఎబోలా విషయంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు. ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలోకి ఎబోలా ప్రవేశించకుండా శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద పటిష్ట చర్యలు చేపట్టామని తెలిపారు. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ వంటి ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు స్క్రీనింగ్, థర్మల్ స్కానింగ్ నిర్వహిస్తూ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని అధికారులు వివరించారు. విమానాశ్రయంలో డాక్టర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, పారామెడికల్ సిబ్బందితో ప్రత్యేక బృందాలు విధులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల కోసం 108 అంబులెన్స్ సేవలను 24 గంటలపాటు అందుబాటులో ఉంచామని, గాంధీ హాస్పిటల్లో 10 పడకల ప్రత్యేక ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ సునీల్ కుమార్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమించినట్లు తెలిపారు. అనుమానితుల నమూనాలను పరీక్షల కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చిన లక్షణాలు లేని ప్రయాణికులను 21 రోజులపాటు హోమ్ ఐసోలేషన్‌లో ఉంచుతూ జిల్లా నిఘా బృందాల ద్వారా పర్యవేక్షిస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ నెల 25వ తేదీ నాటికి 58 మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు వచ్చినప్పటికీ ఎవరికీ వ్యాధి లక్షణాలు లేవని వెల్లడించారు. సమావేశంలో ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఇంటింటి సర్వేతో 'ఇందిరమ్మ కుటుంబ జీవితం బీమా' అమలు

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ఇందిరమ్మ కుటుంబ జీవితం బీమా" పథకం అమలుపై కేబినెట్ సబ్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం వర్తింపజేయాలనే ప్రభుత్వ సంకల్పాన్ని మంత్రులు పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటిని కవర్ చేస్తూ సమగ్ర గృహ స్థాయి డేటా సేకరణ చేపట్టాలని, ఎవరైనా మిగిలిపోతే ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి నమోదు చేయాలని నిర్ణయించారు. ప్రజల్లో పథకంపై అవగాహన పెంచేందుకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ బీమా పథకానికి ప్రత్యేక లోగో రూపొందించి, సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి ఆ లోగోతో కూడిన స్టిక్కర్లను అతికించనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు అన్ని శాఖలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీజీపీ సి.వి ఆనంద్తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' వేడుకలు ఘనంగా నిర్వహించాలి: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 27, ప్రతినిధి: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడంతో జూన్ 2 నుంచి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" ముగింపు వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో నిర్ణయించారు. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. గ్రామ సభల నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజా భాగస్వామ్యంతో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించి పర్యావరణ వారోత్సవం, రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, మహిళా-శిశు రక్షణ, గృహ నిర్మాణం, పర్యాటక ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను విస్తృతంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోపాలు లేకుండా కార్యక్రమాలను విజయవంతం చేయాలని మంత్రులు స్పష్టం చేశారు.




## అర్హులైన ప్రతి ఓటరుకు జాబితాలో స్థానం కల్పించాలి: సీఈఓ సుదర్శన్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 27, ప్రతినిధి: భారత ఎన్నికల సంఘం రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఉప ప్రధాన ఎన్నికల అధికారి జి.ఎస్. చారి, ఆర్.వి. కర్ణన్, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి తదితర అధికారులు పాల్గొన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి తగిన శిక్షణ ఇవ్వాలని, వారి పనితీరును నిరంతరం సమీక్షిస్తూ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు సూచించారు. ఎత్తైన అపార్ట్‌మెంట్ భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలతో పాటు పట్టణ ప్రాంతాలు, మురికివాడలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు సౌలభ్యం కల్పించేలా ఎన్యూమరేషన్ ఫారాలు తెలుగు, ఆంగ్ల భాషల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే వీఐపీ, వీవీఐపీ ఓటర్ల మ్యాపింగ్ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బూత్ స్థాయి అధికారికి "బెస్ట్ బీఎల్ఓ అవార్డు" అందజేయనున్నట్లు ప్రధాన ఎన్నికల అధికారి ప్రకటించారు.




## జేఎన్‌టీయూహెచ్ ఫార్మాస్యూటికల్ కళాశాల అభివృద్ధికి రూ.57.50 కోట్ల మంజూరు

సందేశం టైమ్స్, అందోల్, మే 27, ప్రతినిధి: రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవతో అందోల్ నియోజకవర్గానికి భారీ వరంగా తెలంగాణ ప్రభుత్వం జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అభివృద్ధికి రూ.57.50 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. ఈ నిధులతో ఆధునిక అకాడెమిక్ భవనాల నిర్మాణం, బాలుర మరియు బాలికల హాస్టళ్లు, గెస్ట్ హౌస్ సదుపాయాలు, శాశ్వత క్యాంపస్ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అందోల్ నియోజకవర్గాన్ని విద్యా, వైద్య రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు మంత్రి దామోదర రాజనర్సింహ నిరంతరం కృషి చేస్తున్నారని అధికారులు తెలిపారు. విద్యార్థులకు ఉత్తమ మౌలిక వసతులు, నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన ఈ నిర్ణయం అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. "విద్యాభివృద్ధే యువత భవిష్యత్తుకు బలమైన పునాది" అనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

# వరద విపత్తుల నివారణకు పటిష్ట కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి: కలెక్టర్ దివాకర టీఎస్



సందేశం టైమ్స్, ఖమ్మం, మే 27, ప్రతినిధి: రానున్న వర్షాకాలంలో సంభవించే వరద విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అప్రమత్తంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరద విపత్తుల నిర్వహణ సన్నద్ధతపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి పరిస్థితులను సమీక్షించారు. గతంలో ఖమ్మం జిల్లాలో సంభవించిన భారీ వరదలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, ముంపు గ్రామాలు, కట్ ఆఫ్ ప్రాంతాలు, బలహీన చెరువు కట్టలు, ముంపు రహదారులను ముందుగానే గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, విద్యుత్ శాఖలు మూడు షిఫ్టుల్లో పనిచేస్తూ నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. 1077 టోల్ ఫ్రీ నంబర్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని, అత్యవసర సమయాల్లో అవసరమైన కాంటాక్ట్ బుక్స్ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ముంపు గ్రామాలు, సంబంధాలు తెగిపోయే ప్రాంతాలు, కూలే ప్రమాదంలో ఉన్న ఇళ్ల వివరాలు ముందుగానే సేకరించి పునరావాస కేంద్రాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వరదల సమయంలో అవసరమైన నిత్యావసర వస్తువులు ముందుగానే నిల్వ చేయాలని, ప్రత్యేక కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి మండలంలో ఎంపీడీవో, తహసీల్దార్, పోలీస్, వైద్య, విద్యుత్, ఆర్ అండ్ బి శాఖలతో మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని తెలిపారు. పాత భవనాలు, ప్రమాదకర పాఠశాల గదులు, అంగన్‌వాడీ కేంద్రాలను ముందుగానే గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి మండలంలో వుడ్ కట్టింగ్ యంత్రాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. వరదల అనంతరం దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు పారిశుధ్య చర్యలు, తాగునీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బ్యాడ్మింటన్‌లో రాణించిన క్రీడాకారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందనలు



సందేశం టైమ్స్, ఖమ్మం, మే 27, ప్రతినిధి: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 23, 24 తేదీల్లో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన అండర్-11, అండర్-13 జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2026 సింగిల్స్, డబుల్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి 12వ యోనెక్స్–సన్‌రైజ్ తెలంగాణ రాష్ట్ర సీనియర్, సబ్-జూనియర్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లకు అర్హత సాధించిన క్రీడాకారులను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. రాష్ట్ర డీజీపీ ప్రారంభించిన పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శిక్షణ పొందుతున్న పోలీస్ సిబ్బంది పిల్లలు ఇస్లావత్ కీర్తిష్, వి. నిశాంత్, వి. శ్రీ మేధాన్షా జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచడం ప్రశంసనీయమన్నారు. సీనియర్ విభాగంలో టి. మనోజ్, వి. రోహిత్‌తో పాటు కోచ్‌లు కూడా క్రీడాకారుల విజయానికి కృషి చేశారని కొనియాడారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్న ఆయన, పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సద్వినియోగం చేసుకుని మరింతగా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ఐ కామరాజు తదితరులు పాల్గొన్నారు.

# సామినేని రామారావు హత్య కేసులో నిజమైన దోషులను అరెస్ట్ చేయాలి: కాంగ్రెస్ నాయకులు




సందేశం టైమ్స్, ఖమ్మం, మే 27, ప్రతినిధి: చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు సామినేని రామారావు హత్య కేసులో నిజమైన దోషులను వీలైనంత త్వరగా అరెస్ట్ చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి యాదవ్ ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్తును కలిసి వినతిపత్రం సమర్పించారు. హత్య జరిగిన రోజునే తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పందిస్తూ దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షిస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కేసులో కాంగ్రెస్ నాయకులపై అసత్య ప్రచారాలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ హత్య రాజకీయాలకు దూరమని స్పష్టం చేస్తూ, పోలీసులు 21 మందికి నోటీసులు ఇవ్వగా తమ నాయకులు పూర్తిగా సహకరించి పోలీగ్రాఫ్ పరీక్షలకు హాజరై నిర్దోషులమని నిరూపించుకున్నారని తెలిపారు. వ్యక్తిగత, రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ నాయకులపై తప్పుడు ప్రచారాలు చేయడం సరైంది కాదన్నారు. కుటుంబ సభ్యులు నిజాలు వెల్లడిస్తే కేసులోని చిక్కుముడి వీడే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం సీపీఎం నాయకులు శవ రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు.

# బోరు మోటార్ వైర్ల దొంగతనం కేసులో వ్యక్తి అరెస్ట్




సందేశం టైమ్స్, చింతకాని, మే 27, ప్రతినిధి: జగన్నాధపురం, పందులపల్లి గ్రామ శివార్లలోని పంట పొలాల్లో రైతులు ఏర్పాటు చేసిన బోరు మోటార్ల వైర్లు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన ఘటనపై చింతకాని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. నామవరం ఎక్స్ రోడ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న శీలం నాగరాజు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా, మద్యం సేవించడం మరియు జల్సాలకు అలవాటు పడి ఈ దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి దొంగతనం చేసిన వైర్లను కాల్చి పొందిన సుమారు 3.3 కిలోల కాపర్ వైర్‌తో పాటు వైర్లు అమ్మగా వచ్చిన రూ.20 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతకాని ఎస్సై లక్ష్మణ్ చౌదరి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విధి నిర్వహణలోనే ఆర్టీసీ కండక్టర్ మృతి.. బస్సులో విషాదం



సందేశం టైమ్స్, భద్రాచలం, మే 27, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన ఓ ఆర్టీసీ కండక్టర్ విధి నిర్వహణలో ఉండగానే గుండెపోటుతో మృతి చెందిన విషాదకర ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటుచేసుకుంది. పరకాల డిపోకు చెందిన టీజీఎస్ ఆర్టీసీ బస్సు భద్రాచలం నుంచి హనుమకొండకు బయలుదేరగా, పాల్వంచ సమీపంలోని అనిశెట్టిపల్లి బ్రిడ్జి వద్దకు చేరుకున్న సమయంలో కండక్టర్ బిరిల్లి శంకర్ (50) ప్రయాణికులకు టికెట్లు ఇస్తూ ఒక్కసారిగా గుండెల్లో నొప్పితో కుప్పకూలిపోయారు. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును పక్కకు నిలిపి, ప్రయాణికుల సహాయంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం శంకర్‌ను సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు తీవ్ర గుండెపోటు కారణంగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. క్షణాల వ్యవధిలో కళ్లముందే టికెట్లు ఇచ్చిన కండక్టర్ మృతి చెందడంతో ప్రయాణికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. విధి నిర్వహణలోనే తోటి ఉద్యోగి మృతి చెందడంతో పరకాల డిపోతో పాటు ఆర్టీసీ సిబ్బందిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శంకర్ మృతివార్తతో ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కొప్పుల లక్ష్మి శేషారెడ్డి



సందేశం టైమ్స్, మెదక్, మే 27, మెదక్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశానుసారం అందోల్ నియోజకవర్గం అల్లాదుర్గ్ మండలం చిల్వెర్ గ్రామంలోని సొసైటీలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం జొన్నలకు ప్రతి క్వింటాల్‌కు రూ.3699 మద్దతు ధర నిర్ణయించగా, ప్రతి ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు మాత్రమే కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించి లాభం పొందాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దుర్గా రెడ్డి, అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి, డీసీసీ జిల్లా కార్యదర్శి బాలకిషన్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజాగౌడ్, సర్పంచ్ వీరన్న పటేల్, శంకర్ నాయక్, మండల ఉపాధ్యక్షుడు సాయిబాబా, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కురుమ మహేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, ఏఈఓ, పీఏసీఎస్ సెక్రటరీ శివగౌడ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం వేగంగా అన్‌లోడింగ్ చేయాలి: అదనపు కలెక్టర్ నగేష్



సందేశం టైమ్స్, మెదక్, మే 27, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మిల్లర్లకు సూచించారు. తూప్రాన్ మండలంలోని నవదుర్గ రైస్ మిల్లును మంగళవారం తనిఖీ చేసిన ఆయన ధాన్యాన్ని త్వరగా అన్‌లోడింగ్ చేయడంతో పాటు హమాలీలు, లారీలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అన్‌లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం జరగకుండా మరింత పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, హమాలీలను షిఫ్టుల వారీగా పనిచేయించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం తూప్రాన్ గ్రామ శివారులో వరి ధాన్యం కొనుగోలు, నిల్వ కోసం ఏర్పాటు చేసిన ప్రైవేట్ గిడ్డంగిని పరిశీలించారు. తూప్రాన్, వర్గల్, శివంపేట మండలాల నుంచి సేకరించిన వరి ధాన్యాన్ని ఈ గిడ్డంగిలో నిల్వ చేయనున్నట్లు తెలిపారు. గిడ్డంగిలోని నిల్వ సామర్థ్యం, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయా చంద్రారెడ్డి, సివిల్ సప్లై అధికారులు, మండల తహసీల్దార్లు పాల్గొన్నారు.


# ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు..

## ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది: కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్, మే 27, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ ఈరోజు వరకు జిల్లాలో 2,65,639.880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 54,885 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా 38,402 మంది రైతుల ఖాతాల్లో రూ.423.52 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొనుగోలు కేంద్రాల్లో నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు సమృద్ధిగా అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. లారీలు, ఇతర రవాణా వాహనాలను సమకూర్చి రైతులకు తాగునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు, రవాణా విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 24 గంటల పాటు ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షిస్తున్నాయని కలెక్టర్ వెల్లడించారు.

# బాల్య వివాహాల రహిత జిల్లాగా మెదక్‌ను తీర్చిదిద్దాలి: డీఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్




సందేశం టైమ్స్, మెదక్, మే 27, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: 99 రోజుల ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా మెదక్ కలెక్టర్ కార్యాలయంలో మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "బాల్య వివాహం.. బతుకు ఆగమం" నినాదంతో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల నివారణలో బాల్య వివాహ నిరోధక అధికారుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అధికారి శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో శ్రీరామ్, డీపీవో యాదయ్య, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు. ఇంచార్జి జిల్లా సంక్షేమ అధికారి స్వరూప రాథోడ్ మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యత నిర్వర్తించాలని, జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు, మెడికల్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఐసీపీఎస్, సీహెచ్ఎల్, హబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లా నూతన బీసీ సంక్షేమ శాఖ అధికారిగా కే. ఉపేందర్ బాధ్యతలు



సందేశం టైమ్స్, మెదక్, మే 27, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: మెదక్ జిల్లాకు నూతన బీసీ సంక్షేమ శాఖ అధికారిగా కే. ఉపేందర్ బాధ్యతలు స్వీకరించారు. కమిషనరేట్ నుంచి బదిలీపై మెదక్ జిల్లాకు వచ్చిన ఆయన కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.



## అర్హులకు ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు అందించాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్, మే 27, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు పారదర్శకంగా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయం నుంచి నిర్వహించిన గూగుల్ మీట్‌లో ఆమె మాట్లాడుతూ టూవీలర్, త్రీ వీలర్, సోలార్ పంప్‌సెట్ తదితర పథకాల కింద నిజమైన అర్హులను గుర్తించాలని సూచించారు. గతంలో జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1600 మంది దరఖాస్తు చేసుకోగా, మెదక్ జిల్లా లక్ష్యం 247గా ఉందని తెలిపారు. రుణాల మంజూరులో పూర్తి పారదర్శకత పాటిస్తూ అర్హత గల నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ప్రయోజనం కల్పించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. మే 31వ తేదీ లోపు అన్ని దరఖాస్తుల స్క్రూటినీ పూర్తి చేసి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా లబ్ధిదారుల వివరాలను ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు. ఈ గూగుల్ మీట్‌లో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం తరలింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి: ఆవుల రాజిరెడ్డి



సందేశం టైమ్స్, మెదక్, మే 27, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి మాసాయిపేట మండల కేంద్రంలోని వెంకట సాయి రైస్ మిల్లును సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నుంచి వరి ధాన్యం తరలింపులో జరుగుతున్న జాప్యంపై తహసీల్దార్, ఆర్ఐ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉన్న వరి ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని ఆవుల రాజిరెడ్డి కోరారు.

## ముందు వడ్లు కొనండన్న ఆర్టీసీ డ్రైవర్‌పై వేటు



సందేశం టైమ్స్, జగిత్యాల, మే 27, ప్రతినిధి: పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా జగిత్యాలలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పాల్గొంటున్న సమయంలో "ముందు వడ్లు కొనండి" అని వ్యాఖ్యానించిన జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ఈ ఘటన అనంతరం ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డ్రైవర్‌కు రిమూవల్ లెటర్ జారీ చేసి డ్యూటీకి రావద్దని సూచించినట్లు సమాచారం. అయితే తాను ఏ రాజకీయ పార్టీని లేదా నాయకుడిని విమర్శించలేదని, కేవలం రైతుల సమస్యల గురించే మాట్లాడానని డ్రైవర్ అశోక్ వెల్లడించారు. ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

## ఉపాధి పనులు గ్రామాభివృద్ధికి పునాది: ఏపీడీ





సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 27, క్రైమ్ రిపోర్టర్ టీ నాగరాజు: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల పరిధిలోని మరవెల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు, నర్సరీను ఏపీడీ, ఈసీలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నిర్వహణ, కూలీల హాజరు, వేతనాల చెల్లింపులపై అధికారులు ఆరా తీశారు. ఉపాధి హామీ పనులు సక్రమంగా కొనసాగుతున్నాయని, కూలీలకు వేతనాలు సకాలంలో జమ అవుతున్నాయా అనే విషయాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఎవరికైనా వేతనం అందకపోతే వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మండల స్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోతే జిల్లా స్థాయిలో పరిశీలించి ప్రతి కూలీకి వేతనం అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. వర్షాకాలం వరకు ఉపాధి పనులు నిరంతరంగా కొనసాగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు ఆపకూడదని సూచించారు. ఉపాధి పనులు గ్రామాభివృద్ధికి పునాది కాగా, గ్రామీణ కూలీలకు ఉపాధి భరోసా కల్పిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ ప్రదీప్, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహులు, ఉపాధి హామీ కూలీలు, అధికారులు పాల్గొన్నారు.

## జోగిపేట్ నుంచి అక్రమ కలప రవాణా.. చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



సందేశం టైమ్స్, అందోల్, మే 27, ప్రతినిధి: జోగిపేట్ ప్రాంతం నుంచి అక్రమంగా కలప రవాణా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో కొందరు వ్యక్తులు విలువైన కలపను వాహనాల ద్వారా రహస్యంగా తరలిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. జోగిపేట్ పరిసర ప్రాంతాల అడవుల నుంచి అక్రమంగా నరికిన కలపను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై అటవీ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అక్రమ కలప రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలి' అంశంపై మాజీ ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు చర్చనీయాంశం



సందేశం టైమ్స్, జాతీయ ప్రతినిధి, మే 27, 2026: ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలన్న డిమాండ్‌కు మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ మద్దతు తెలిపినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గోవధ నివారణకు శాశ్వత పరిష్కారంగా ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని జమీయత్ ఉలామా-ఇ-హింద్ అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదానీతో పాటు పలువురు మత పెద్దలు ఇటీవల డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పందించిన హమీద్ అన్సారీ సమస్యకు మూల కారణాలను గుర్తించి సమగ్రంగా పరిష్కార మార్గాలను అన్వేషించాలని అభిప్రాయపడ్డారని సమాచారం. ఆవు పేరుతో దేశంలో జరుగుతున్న రాజకీయ, సామాజిక చర్చలు మరింత వేడెక్కుతున్నాయని వివిధ వర్గాలు పేర్కొంటున్నాయి. మాజీ ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

## దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట: ముత్తినేని వీరయ్య



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 27, 2026: దివ్యాంగుల సంక్షేమం, వారి ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డితో కలిసి దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలు, స్కూటీలు, బ్యాటరీ వీల్‌చైర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 30 మంది లబ్ధిదారులకు స్కూటీలు, 15 మందికి బ్యాటరీ వీల్‌చైర్లు అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వీరయ్య పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని దివ్యాంగులకు కూడా ప్రభుత్వ సేవలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమలోని ప్రతిభను వెలికితీసుకుని సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పాండు, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి: సిపిఎం నిరసన



సందేశం టైమ్స్, అందోల్, మే 27, ప్రతినిధి: పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం జోగిపేట్ బస్టాండ్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం అందోల్ డివిజన్ కార్యదర్శి డి. విద్యాసాగర్ మాట్లాడుతూ వారం రోజుల్లో నాలుగు సార్లు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై కేంద్ర ప్రభుత్వం పెను భారం మోపుతోందని విమర్శించారు. అదానీ, అంబానీలకు లాభం చేకూర్చే విధానాలు తప్ప ప్రజలకు ఉపశమనం కల్పించడం లేదని ఆరోపించారు. పెరిగిన గ్యాస్ ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, నిత్యావసర సరుకులు, ఎరువులు, విత్తనాల ధరలు కూడా పెరిగి రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని, రైతులకు అవసరమైన ఎరువుల ధరలు నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, వెంకటేశం, ఆసిఫ్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.20 లక్షల లంచం తీసుకుంటూ తహసీల్దార్ ఏసీబీకి చిక్కిన ఘటన



సందేశం టైమ్స్, మేడ్చల్, మే 27, ప్రతినిధి: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన దాడుల్లో తహసీల్దార్ సుచరిత రూ.20 లక్షల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన ఘటన సంచలనం సృష్టించింది. బొమ్మరాసిపేట ప్రాంతంలో భూముల క్రమబద్ధీకరణ పేరుతో భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులతో కలిసి భూములను క్లియర్ చేస్తున్నట్లు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారనే సమాచారం మేరకు ఏసీబీ అధికారులు ఉచ్చుపన్ని నిర్వహించి ఆమెను పట్టుకున్నారు. ఘటన స్థలంలో కీలక పత్రాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

## బాల్య వివాహాలపై కిషోర బాలికలకు అవగాహన కార్యక్రమం



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, మే 27, ప్రతినిధి: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కల్హేర్ మండల కేంద్రంలో గల మండల సమాఖ్య కార్యాలయంలో 99 రోజుల ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా కిషోర బాలికలు, స్నేహ సంఘాల సభ్యులకు బాల్య వివాహాల నివారణ, మహిళా-బాలల రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్హేర్ ఎస్సై రవిగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై బాల్య వివాహాల వల్ల బాలికల భవిష్యత్తుపై కలిగే ప్రతికూల ప్రభావాలను వివరించారు. చిన్న వయసుల్లో వివాహాలు చేయడం చట్టవిరుద్ధమని, అలాంటి ఘటనలు తెలిసిన వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాలికలు విద్యపై దృష్టి పెట్టి తమ లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న షీ టీమ్స్, మహిళా హెల్ప్‌లైన్, చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఇన్‌చార్జ్ ఏఎస్ఐ తులసిరాం, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి విఠల్ నర్సింలు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జెబా, ఏపీఎం వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదలతో ముందుకు సాగితే దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించగలరు: నిర్మల జగ్గారెడ్డి



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 27, ప్రతినిధి: పట్టుదల, మనోధైర్యంతో ముందుకు సాగితే దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించగలరని టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెతో పాటు తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలు, స్కూటీలు, బ్యాటరీ వీల్‌చైర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 30 మంది లబ్ధిదారులకు స్కూటీలు, 15 మందికి బ్యాటరీ వీల్‌చైర్లు అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముత్తినేని వీరయ్య తెలిపారు. దివ్యాంగులు స్వయం ఆధారితంగా జీవించేందుకు అవసరమైన ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

# కుప్పానగర్–మచునూర్ శివారులో ఆటో బోల్తా.. ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు



సందేశం టైమ్స్, ఝరాసంగం, మే 27, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం పరిధిలోని కుప్పానగర్–మచునూర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఝరాసంగం గ్రామానికి చెందిన సంగమ్మ, బాలమ్మ జహీరాబాద్ మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేసి ఆటోలో గ్రామానికి తిరిగి వస్తుండగా డ్రైవర్ అదుపుతప్పడంతో ఆటో రోడ్డుపక్కనున్న పొలంలోకి దూసుకెళ్లి చెట్ల మధ్య బోల్తాపడింది. ప్రమాద సమయంలో ఆటోలో కూరగాయల సంచులు కూడా ఉన్నట్లు సమాచారం. ఘటన గమనించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి గాయపడిన మహిళలను బయటకు తీసి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం 108 సిబ్బంది బాధితులకు ప్రాథమిక చికిత్స అందించి జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల వివరాల ప్రకారం సంగమ్మకు రెండు చోట్ల కాలు విరిగినట్లు, బాలమ్మకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. ఆటో వేగం అధికంగా ఉండటం, రహదారి పక్కన గుంతలు ఉండటమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ 2026 దరఖాస్తులకు ఆహ్వానం

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 27, ప్రతినిధి: వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన 5 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బాలల నుంచి "ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ (PMRBP) 2026" అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహా రావు తెలిపారు. మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో ఈ అవార్డులు వ్యక్తిగత విభాగాల్లో ఇవ్వబడతాయని ఆయన పేర్కొన్నారు. ధైర్యం, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు-సంస్కృతి, విజ్ఞానం-సాంకేతికత వంటి విభాగాల్లో ప్రతిభ కనబరిచిన బాలలు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అర్హులైన అభ్యర్థులు https://awards.gov.in వెబ్‌సైట్ ద్వారా 31-07-2026 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన బాలలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తు గడువు 31 వరకు పొడిగింపు

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 27, ప్రతినిధి: 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తు గడువును ఈ నెల 31 వరకు ప్రభుత్వం పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కె. దయానంద రాణి తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న అర్హులైన ఎస్సీ విద్యార్థులు (ఫ్రెష్ మరియు రెన్యువల్) పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తప్పనిసరిగా ఈ-పాస్ వెబ్‌సైట్ http://telanganaepass.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉపకార వేతనాల నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని ఆమె కోరారు.

# గ్రామ పంచాయతీ సిబ్బందికి సీఎం గుడ్ న్యూస్

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 27, ప్రతినిధి: గ్రామ పంచాయతీ సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ తెలిపారు. ఇకపై రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా 1వ తేదీన జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. జీతాల చెల్లింపుల కోసం ప్రతి నెలా రూ.50 కోట్లు ప్రత్యేకంగా విడుదల చేయనున్నట్లు తెలిపారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకూ సమయానికి వేతనాలు చెల్లించేలా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు.గ్రామ పంచాయతీల స్వంత ఆదాయాన్ని బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. అలాగే పెన్షన్లను పోస్టల్ విధానం కాకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని సూచించారు. ఆధార్, ఓటర్ ఐడీ వంటి డేటా ఆధారంగా పెన్షన్ వ్యవస్థను క్రమబద్ధీకరించాలని తెలిపారు. కొత్తగా మంజూరు చేసే పెన్షన్లలో ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు.

# ఢిల్లీలో క్వాడ్ విదేశాంగ మంత్రుల కీలక సమావేశం

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మే 27, ప్రతినిధి: భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అధ్యక్షతన ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో క్వాడ్ (Quad) విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ దేశాల విదేశాంగ మంత్రులు పాల్గొన్నారు. అమెరికా తరఫున మార్కో రూబియో, ఆస్ట్రేలియా నుంచి పెన్నీ వాంగ్, జపాన్ నుంచి తోషిమిత్సు మోటెగి సమావేశానికి హాజరయ్యారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సహకారాన్ని బలోపేతం చేయడం, ప్రాంతీయ భద్రత, వ్యూహాత్మక భాగస్వామ్యంపై విస్తృతంగా చర్చలు జరిగినట్లు సమాచారం. Quadrilateral Security Dialogue సభ్య దేశాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై నేతలు దృష్టి సారించారు.



# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 27, ప్రతినిధి: జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన చివ్వెంల మండలం బిబి గూడెంలోని శివ దుర్గ రైస్ మిల్, తిరుమలగిరి మండలం ఇటూరు గ్రామంలోని సోమేశ్వర రైస్ మిల్ ఇండస్ట్రీ, వ్యవసాయ మార్కెట్, పారా రైస్ మిల్, తాటిపాముల పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పర్యవేక్షించి మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయాలని, మిల్లర్లు జాప్యం చేయకూడదని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరగా రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ మోహన్ బాబు, డీఎం సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, తహసిల్దార్లు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనతోనే మహిళా సాధికారత సాధ్యం: జిల్లా కో ఆర్డినేటర్ చైతన్య



సందేశం టైమ్స్, మునగాల, మే 27, ప్రతినిధి: బాల్య వివాహాల నిర్మూలనతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ చైతన్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాలలో భాగంగా మునగాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీ సూపర్వైజర్ శ్రీలత, ఐసీపీఎస్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికలు శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని, విద్య మధ్యలోనే ఆగిపోవడం వల్ల భవిష్యత్తు దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. బాల్య వివాహాల నిరోధక చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అలాంటి ఘటనలు తెలిసిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్నేహ గ్రూపుల ద్వారా బాలికలు తమ సమస్యలను పంచుకుని రక్షణ పొందవచ్చని ఆమె వివరించారు. అంగన్‌వాడీ సూపర్వైజర్ శ్రీలత మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రమీల శ్రీనివాస్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తిరుమలగిరిలో బాలికలకు సైకిళ్ల పంపిణీ: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 27, ప్రతినిధి: మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తిరుమలగిరి మండలంలో బాలికలకు సైకిళ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిథిగా హాజరై బాలికలకు సైకిళ్లు అందజేశారు. మహిళా సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించిన "మహిళా శక్తి" కార్యక్రమంలో స్నేహ సంఘాల బాలికలకు ఈ సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత బాలికల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సైక్లింగ్ ద్వారా బాలికల్లో శారీరక దృఢత్వం పెరగడమే కాకుండా ఆత్మవిశ్వాసం కూడా పెంపొందుతుందని ఆయన అన్నారు. మహిళలు, బాలికలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ హరిప్రసాద్, ఎంపీడీవో లాజర్, ఏపీఎం లక్ష్మి, సీసీ నాగయ్య, ఎమ్మెస్ అధ్యక్షురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 27, ప్రతినిధి: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలోని 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా మొదటి తారీఖునే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు సమయానికి జీతాలు అందినట్లే గ్రామ పంచాయతీ సిబ్బందికి కూడా అదే విధంగా చెల్లించాలన్నారు. సిబ్బంది జీతాల కోసం ప్రతి నెలా రూ.50 కోట్లు ప్రత్యేకంగా కేటాయిస్తామని తెలిపారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ అనే తేడా లేకుండా అన్ని శాఖల ఉద్యోగులకు మొదటి తేదీనే జీతాలు చెల్లించాలని స్పష్టం చేశారు.గ్రామ పంచాయతీల స్వంత ఆదాయంపై గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల వచ్చిన పరిమితులను సవరించేందుకు అంగీకారం తెలిపిన సీఎం, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 70(3) ప్రకారం గ్రామ పంచాయతీ స్వంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతా కాకుండా బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా సవరణ చేయాలని ఆదేశించారు. పెన్షన్ పంపిణీ విధానంలో మార్పులు చేసి, పోస్టల్ శాఖ ద్వారా కాకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని సూచించారు. అర్హులకే పెన్షన్లు అందేలా ఓటర్ ఐడీ, ఆధార్, ఇతర డేటా ఆధారంగా వ్యవస్థను సరిచేయాలని తెలిపారు. కొత్త పెన్షన్లలో ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.